సాక్షి
ఒడిశా

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,64,343
బంగారం	19 గ్రాముల 190 మిల్లీ గ్రాములు
వెండి	72 గ్రాముల 640 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



భక్తిశ్రద్ధలతో దొండొనచో దీక్షలు

గజపతి, గంజాం జిల్లాల్లో దొండొనచో దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షాధారులు రోడ్డుపై ఇసుక వేసి బోర్లాపడుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

– IIలో.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
సోమ (సా)	మంగళ (ఉ)
6.08	4.19

న్యూస్‌రీల్

మావోయిస్టుల పేరిట కాంట్రాక్టర్‌కు లేఖ

జయపురం: సబ్ డివిజన్‌లోని బొయిపరిగుడ సమితిలో రోడ్డు కాంట్రాక్టర్‌కు మావోయిస్టుల పేరిట లేఖ రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బొయిపరిగుడ సమితిలో ధలపూర్ నుంచి బలిగాం మీదుగా సింధిగాం కూడలి వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి పనులు చేస్తున్న డ్రైవర్‌కు లేఖ అందజేసి కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని చెప్పి వెళ్లిపోయారు. వెంటనే కాంట్రాక్టర్‌కు అందజేయగా ఆయన రామగిరిలోని బీఎస్ఎఫ్ శిబిరానికి వెళ్లి లేఖ అందజేశారు. అనంతరం కొరాపుట్ ఎస్పీ విషయం తెలియజేశాడు. ఒడిశా మావోవాది పార్టీ, ఫోన్ నంబర్ తప్ప ఫలానా మావోయిస్టు డివిజన్ అని లేఖలో పేర్కొనలేదు. కాగా, లేఖలో ఏం రాశారో అన్న విషయం వెల్లడికాలేదు. దర్యాప్తు జరుపుతున్నామని బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ తెలిపారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు అరెస్టు



నిందితుడు సొంబురు నాయిక్

జయపురం: కుటుంబ కలహాల కారణంగా అన్నను హత్య చేసిన తమ్ముడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. జయపురం సమితి నీలాగుడ గ్రామానికి చెందిన హరిశ్చంద్రనాయిక్, సొంబురునాయిక్ అన్నదమ్ములు. ఒకే ఇంట్లో కలిసి ఉంటున్నారు. కొన్నాళ్లుగా కుటుంబ కలహాల కారణంగా గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో ఎలాగైనా అన్నను హతమార్చాలని భావించిన సొంబురు రెండు సార్లు విఫలయత్నం చేశాడు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన సొంబురు ఇంటిలో కత్తి తీసుకొచ్చి అన్న హరిశ్చంద్రను నరికి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన హరిశ్చంద్రను స్థానికులు జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. సొంబురుపై కేసు నమోదు చేసి గాలించగా బొరిగుమ్మలో పట్టుపడ్డాడు.


విదేశీ మద్యం పట్టివేత



మద్యంతో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా 17 లీటర్ల విదేశీ మద్యం తరలిస్తున్న వ్యక్తి పట్టుబడ్డారు. అరెస్టు చేసి విచారణ జరపగా కలిమెల సమితి యం.వి.79 గ్రామానికి చెందిన సుఖ్‌దేవ్ ఖిలోగా గుర్తించారు. బలిమెల ఐఐసీ సుమన్ పట్నాయక్ కేసు నమోదు చేశారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

వర్షంతో ఉపశమనం



ఖుర్దారోడ్ రైల్వే ఆస్పత్రి ఆవరణలో పిడుగుపాటుకు కాలిన కొబ్బరి చెట్టు

భువనేశ్వర్: గత మూడు రోజులుగా తీవ్ర వేడిమితో అల్లాడిన స్థానికులు ఆదివారం సాయంత్రం మారిన వాతావరణంతో కాస్త ఉపశమనం పొందారు. ఖుర్దా రోడ్‌లో పిడుగు పడటంతో రైల్వే ఆస్పత్రి ఆవరణలో కొబ్బరి చెట్టుకు నిప్పు అంటుకుంది. కొన్ని నిమిషాలపాటు ఉరుములు, పిడుగులు దద్దరిల్లించాయి. పగటి పూట మేఘావృతం కావడంతో ఉష్ణోగ్రత కొద్దిపాటి తగ్గింది. సాయంత్రం నాటికి బలమైన గాలులు, మెరుపులు, పిడుగులతో కూడిన వాతావరణం అలముకుంది. దీంతో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేశారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో భువనేశ్వర్, ఖుర్దారోడ్ పరిసర ప్రాంతాల్లో దాదాపు అరగంట పాటు వర్షం కురవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.



నవీన నిర్ణయం.. వ్యూహాత్మకం

- కొత్త ఎత్తుగడ వేసిన బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్
- గెలుపే లక్ష్యంగా ఐదుగురు ప్రముఖులకు కీలక బాధ్యతలు
- సొంత పార్టీలో అసమ్మతి రేగకుండా చాకచక్య నిర్ణయం
- ప్రత్యర్థి వర్గాల ఆశలను చిత్తుచేసేలా రాజకీయం



భువనేశ్వర్: రాష్ట్ర రాజకీయాల్లో బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో తనదైన శైలిలో రాజకీయాలు చేస్తూ ప్రత్యర్థి వర్గాల ఎత్తులను చిత్తు చేస్తున్నారు. ప్రత్యక్ష పోరులో అభ్యర్థుల్ని ఖరారు చేయడంలో ఎంత జాగ్రత్త వహిస్తారో అంత కంటే లోతుగా సంస్థాగత బాధ్యతలతో కీలకమైన పదవుల్ని కేటాయించడంలో నవీనత చాటుకోవడం ఆయన ప్రత్యేకత. తాజాగా ఐదుగురు ప్రముఖుల్ని పార్లమెంటరీ నియోజకవర్గాల సమన్వయకర్తలుగా నియమించి కీలకమైన బాధ్యతల్ని కేటాయిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో బరంపురం మాజీ ఎంపీ చంద్రశేఖర సాహు, రాజ్యసభ సభ్యులు దేబాశిష్ సామంత్రాయ్, సుభాశిష్ ఖుంటియా, సుజీత్ కుమార్, ప్రతాప్ జెనా ఉన్నారు.

అసమ్మతి చెలరేగకుండా..

ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో సొంత కుంపటి నిప్పులు చెరగకుండా ముందస్తు వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు. మరోవైపు ప్రధాన ప్రత్యర్థులు భారతీయ జనతా పార్టీ, కాంగ్రెసు నుంచి వలస వస్తున్న దాదాపు ప్రతి ఒక్కరికి సొంత పార్టీ విజేత అభ్యర్థుల్ని పక్కన బెట్టి మరీ పట్టం గడుతున్నారు. ఈ నేపథ్యంలో అసమ్మతి సెగలు చెలరేగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పలు సమస్యాత్మక నియోజకవర్గాల్లో అసమ్మతి తలెత్తకుండా ఆయా నియోజకవర్గాల్లో ఉద్దండులను నియమించారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహం ఈసారి ఒకింత బెడిసి కొట్టిన అధిక ఫలితమే ప్రసాదించింది. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అశ్విని వైష్ణవ్‌కు బీజేడీ అండగా నిలిచి రాజ్యసభకు రెండోసారి పంపిన వ్యూహం ఫలప్రదం కాలేదు. సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు సంకల్పంతో బీజేపీకి చేయూతగా నిలిచి కూటమి కలిసి రాలేదు.

సొంత అభ్యర్థులకు పట్టం..

రాజ్యసభ ఎన్నికల్లో సొంత అభ్యర్థులను బరిలోకి దింపి ఎదుగుదల కల్పించడం త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పలు కీలక సమస్యాత్మక పరిస్థితుల్ని సునాయాశంగా అధిగమించింది. కటక్ బారాబటి నియోజకవర్గంలో ప్రముఖుడు, సిటింగ్ ఎమ్మెల్యే దేబాశిష్ సామంత్రాయ్‌కు రాజ్యసభకు సాగనంపి ఈ స్థానం నుంచి కొత్త ముఖానికి రంగంలోకి దింపేందుకు మార్గం సుగమం చేసుకున్నారు. కటక్ జిల్లా మహంగ శాసనసభ నియోజకవర్గం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఊగిసలాడుతోంది. ఇక్కడి సిటింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రతాప్ జెనాపై హత్యారోపణ ఉంది.ఈ స్థానం నుంచి ప్రతాప్ జెనా కుమారుడు అంకిత్ జెనాకు టికెటు కేటాయించి తనయుని గెలుపు వ్యూహం బాధ్యతల్ని తండ్రికి కేటాయించారు. ఈసారి కటక్ లోక్‌సభ స్థానం కైవసం చేసుకోవడం నవీన్ తాజా లక్ష్యం. దీర్ఘకాలంగా ఈ నియోజకవర్గం నుంచి బీజేడీ అభ్యర్థిగా పోటీ చేసిన దక్షత కలిగిన భర్తృహరి మెహతాబ్ బీజేపీ అభ్యర్థిగా పోటీకి నిలబడ్డారు. ఆయనపై గెలుపు పార్టీ పరువు ప్రతిష్టలతో ముడిపడి ఉంది. రాష్ట్రంలో మరో సమస్యాత్మక జిల్లా పూరీ. ఇక్కడి నుంచి శుభాసిష్ ఖుంటియాకు రాజ్యసభకు పట్టం గట్టి స్థానిక రాజకీయ వివాదాల్లో తలదూర్చేందుకు వీలు లేకుండా చేయడం నవీన్ వ్యూహంలో దక్షతని అద్దం పడుతోంది. పూరీ జిల్లాలో ఇరుగు పొరుగు నియోజకవర్గాల్లో సిగపట్లు పడుతున్న పార్టీ నేతలకు సత్యబాది, బ్రహ్మగిరి నియోజకవర్గాల సరిహద్దులు తారుమారు చేసి నియోజకవర్గాలు అటు ఇటుగా మలిచి టికెట్లు కేటాయించి సత్తాచాటుకోవాలని సవాల్ విసిరారు. మరో వైపు గంజాం జిల్లా బరంపురం లోక్ సభ నవీన్ పట్నాయక్ రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైనది. ఇక్కడి సిటింగు ఎంపీ చంద్రశేఖర సాహుని వివాదరహితంగా దారి మళ్లించి బీజేపీ వలస అభ్యర్థి భృగు బక్షిపాత్రోకు టికెటు కేటాయించారు. బక్షిపాత్రో గెలుపు బాధ్యతల్ని చంద్రశేఖర సాహుకు కేటాయించి ప్రత్యేకత చాటుకున్నారు.

ప్రత్యర్థివర్గంలో గుబులు..

బీజేడీ అధ్యక్షుని హోదాలో నవీన్ పట్నాయక్ ఆదివారం జారీ చేసిన ఉత్తర్వులు ప్రత్యర్థి శిబిరంలో కలకలం రేపుతున్నాయి. ప్రధానంగా అసమ్మతి సెగతో పబ్బం గడుపుకుందామనుకునే వర్గాలకు ఈ నిర్ణయం గొడ్డలిపెట్టుగా మారింది. ముగ్గురు బిజూ జనతాదళ్ ఎగువ సభ సభ్యులు, ఇద్దరు దక్షత కలిగిన నాయకులకు ప్రత్యేక బాధ్యతలను కేటాయించారు.

దేబాశిష్ సామంత్రాయ్, సుభాసిష్ ఖుంటియా





గత వారం రాజ్యసభ సభ్యులుగా దేబాశిష్ సామంత్రాయ్, శుభాసిష్ ఖుంటియా ప్రమాణ స్వీకారం చేశారు. వీరివురికి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధ్యక్షుడు ప్రత్యేక బాధ్యతల్ని కేటాయించడం విశేషం. వీరి దక్షతకు ఈ ప్రత్యేక బాధ్యతలు పెను సవాల్‌గా నిలుస్తాయి. బీజేడీ అధీనంలో ఉన్న 2 లోక్ సభ స్థానాలు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మరింత బలోపేతం చేసే బాధ్యతల్ని వీరివురికి కేటాయించారు. వీటిలో పూరీ, భద్రక్ పార్లమెంటరీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2019లో పూరీ లోక్‌సభ స్థానం నుంచి పినాకి మిశ్రా 11,714 ఓట్లతో గెలుపొందారు. భద్రక్ పార్లమెంటరీ నియోజక వర్గం నుంచి మంజులత మండల్ 28,803 ఓట్ల తేడాతో విజేతగా నిలిచింది. ఈసారి భారీ ఆధిక్యత కూడగట్టుకునే వ్యూహాత్మక కార్యాచరణ బాధ్యతల్ని దేబాశిష్ సామంత్రాయ్, శుభాశిష్ ఖుంటియాకు కేటాయించారు.

సుజీత్‌కుమార్



సుజీత్‌కుమార్ ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు. ఆయన కీలక బిజూ జనతాదళ్ వ్యూహకర్త. కలహండి లోక్‌సభ స్థానానికి ఆయన్ను సమన్వయకర్తగా నియమించారు. కలహండి లోక్‌సభ సీటు కైవసం చేసుకోవడంలో సుజిత్ కుమార్ లక్ష్యం ఛేదించడంపై బీజేడీలో అతని భవిష్యత్ ఆధారపడి ఉంటుంది.

చంద్రశేఖర్ సాహు..



గత ఎన్నికలలో బరంపురం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి భృగు బక్షిపాత్రోపై దాదాపు 94,000 ఓట్ల తేడాతో చంద్రశేఖర్ సాహు ఘన విజయం సాధించారు. 2019లో తన ప్రధాన ప్రత్యర్థిని తాజా ఎన్నికల్లో గెలుపును నిర్ధారించే బాధ్యతను చంద్రశేఖర్‌కు ప్రత్యేక బాధ్యతగా అప్పగించడం నవీన్ యుద్ధ నీతి. చంద్రశేఖర్ సాహు బరంపురం నియోజక వర్గంలో అనుభవజ్ఞుడైన నాయకుడు. లోగడ ఆయన కాంగ్రెసు అభ్యర్థిగా కూడ వెలుగొందారు. తదుపరి దశలో బీజేడీలో చేరారు. 2019కి ముందు 2004లో బరంపురం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి బీజేపీ, బీజేడీ కూటమి అభ్యర్థిని ఓడించి కేంద్ర మంత్రిగా విజయ కేతనం ఎగుర వేశారు. గంజాం జిల్లాలో బరంపురం పార్లమెంటరీ నియోజక వర్గం అత్యంత ప్రతిష్టాత్మకం.

ప్రతాప్ జెనా



కటక్ జిల్లాలో సంచలనం రేపుతున్న వర్ధమాన నాయకుడు ప్రతాప్ జెనా. ఆయన మహంగ నియోజకవర్గం నుంచి శాసన సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం హత్యారోపణల్ని ఎదుర్కొంటున్నారు. కాకపోతే వరుసగా 5 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. వర్ధమాన పరిస్థితులకు అనుగుణంగా ఆయన కుమారుడు అంకిత్ జెనాకు తండ్రి స్థానం, కేంద్రాపడా లోక్‌సభ పరిధిలో మహంగా నియోజకవర్గం కేటాయించారు. కాంగ్రెస్‌కు ఇటీవల గుడ్ బై పలికిన అన్షుమాన్ మహంతికి బీజేడీ కేంద్రాపడా లోకసభ అభ్యర్థిగా బరిలోకి దింపింది. అటు కొడుకు గెలుపు బాధ్యతల్ని నిర్వహిస్తు ఇటు కొత్త ముఖం అన్షుమాన్ మహంతి గెలుపు బాటని సుగమం చేయడం ప్రతాప్ జెనా ప్రస్తుత బాధ్యత. దీంతో కేంద్రాపడా లోక్‌సభ నియోజక వర్గంలో సమగ్రంగా ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల బాధ్యతని ఆయన చాకచక్యంగా నిర్వహించాల్సి ఉంటుంది.

ఉగాది వేడుకలకు సన్నాహాలు



సాధన చేస్తున్న బాలలు

భువనేశ్వర్: తెలుగు సంవత్సరాది ఇంటింటా సందడి తెచ్చింది. క్రోధి నామ సంవత్సరం ఆరంభం పురస్కరించుకుని ఖుర్దారోడ్, భువనేశ్వర్ ఇతరేతర పరిసర ప్రాంతాల్లో ఆంధ్రులు పలు కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాతృ రాష్ట్రం నుంచి తరలివచ్చి స్థానికంగా స్థిరపడిన పలు కుటుంబాలు ఉగాది పురస్కరించుకుని సామూహికంగా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఖుర్దారోడ్ తెలుగు సౌరభం సమూహం ఆబాలగోపాలంతో పలు ఉత్సాహభరితమైన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంది. ఉగాది వేడుకల్లో పోటాపోటీ ప్రదర్శన కోసం ఎవరి ఇళ్లల్లో వారు ఆటపాటల సాధనలో హడావిడిగా కనిపిస్తున్నారు. ఈ ఏడాది వేడుకల్లో పెద్ద సంఖ్యలో సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్న తెలుగు సౌరభం సమూహం ప్రతినిధులు తెలిపారు. తెలుగు సత్సంప్రదాయాల పరిరక్షణ ధ్యేయంగా ఏటా ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఉన్నతాధికారులు

బరంపురం: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల చైర్మన్ రంజన్‌కుమార్ కాంత్ హెచ్చరించారు. శనివారం బరంపురంలోని దక్షిణాంచల్ రెవెన్యూ కమిషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల సమావేశం నిర్వహించారు. గంజాం కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, ఎస్పీ జగ్మోహన్ మీనా, బరంపురం సబ్-కలెక్టర్ దీనా దస్తగిరి, జిలా మేజిస్ట్రేట్ మధుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాం జిల్లాలోని అస్కా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో 28,46,016 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. 3077 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. 10 మంది ఎన్నికల అధికారులను నియమించామని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతిలోనే..



వేదికపై అతిథులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ్ నర్సింగ్ కాలేజీలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ప్రఫుల్లకుమార్ నాంధో మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతిలోనే ఉందన్నారు. ప్రతిఒక్కరూ యోగా చేస్తూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్, మల్కన్‌గిరి కాలేజీ ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం తప్పనిసరి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మనోజ్

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న జరగనున్న పోలింగ్‌లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఓటరు చైతన్య రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సమితుల్లో రథం పర్యటించి ఓటుహక్కు ఆవశ్యకత, వినియోగంపై అవగాహన కల్పిస్తుందని చెప్పారు. గుణుపూర్, రాయగడ, బిసంకటక్ శాసన సభ నియోజకవర్గాల్లోని 883 కేంద్రాల్లో ఒకే రోజు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అన్నిచోట్లా ప్రచార రథం తిరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రాదేవి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, డిప్యూటీ కలెక్టర్ సూర్యమణి భోయ్, అదనపు కలెక్టర్ మృత్యుంజయ్ బొరాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదనం ఉట్టిపడేలా..!



మధుర మీనాక్షి



చిన్నారులతో నిర్వాహకులు



తెలుగు సంప్రదాయ దుస్తుల్లో..



అచ్చమైన తెలుగు అమ్మాయిగా..



రైతు బిడ్డగా..



జగన్నాథునిగా..

ఉగాది ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తేజస్వీ గ్రౌండ్స్‌లో చిన్నారుల సంప్రదాయ వేషధారణ పోటీలు అద్యంతం అలరించాయి. బుడి బుడి అడుగులు వేస్తున్న చిన్నారుల నుంచి 15 ఏళ్ల లోపు బాలబాలికల అద్భుత ఆహార్యంతో ఆకట్టుకున్నారు. మధురమీనాక్షి, రైతుబిడ్డ, పండితుడు, గ్రామీణ స్త్రీ, అచ్చమైన తెలుగు అమ్మాయి వంటి వేషాధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన విజయ, పింకి, సరస్వతిలు అడిగిన చిన్ని చిన్న ప్రశ్నలకు తడబడుతూ ముద్దు ..ముద్దు మాటలతో సమాధానాలు చెప్పిన వైనం ప్రత్యేకంగా నిలిచింది. మొత్తం 55 మంది చిన్నారులు పాల్గొనగా జూనియర్ విభాగంలో లిఖిత్ సింగ్, ఎం.అక్షయ్, పి.మౌనిక, సీనియర్ విభాగంలో లక్కి, మౌక్షిత్, పూజాత, పూర్ణిమ, తంగుడు తేజస్వినిలు బహుమతులను గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఇప్పలి సన్యాసిరాజు, బంగారి బాబు, సంఘం నాయుడు, తంగుడు శ్రీనివాస్, బొచ్చ శ్రీనివాస్, భళ్లమూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

– రాయగడ

క్లుప్తంగా

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

మందస: మండలంలోని బాలిగాం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇచ్ఛాపురం వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ బాలిగాం అండర్‌పాసేజ్ వద్ద ఆగి ఉండగా.. వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న రాజేశ్, రమేష్ అనే యువకులు ఢీకొన్నారు. తీవ్ర గాయాలపాలైన ఇద్దరినీ హైవే అంబులెన్స్‌లో పలాసలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


'ప్రజలను చైతన్యవంతం చేద్దాం'



పోటీల్లో గెలుపొందినవారికి షీల్డ్ అందజేస్తున్న జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి గిరిధర్

శ్రీకాకుళం: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం రచయితలు ముందుకు రావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశాస్త్రీయ భావనలు, మూఢ నమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో శాస్త్రీయ సమాజం కోసం, ప్రజా సంక్షేమం కోసం కవులు, రచయితలు తమ రచనలతో ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ ఉగాది సందర్భంగా జిల్లాస్థాయి కవితల పోటీల్లో కుప్పిలి వెంకట రాజారావుకు ప్రథమ స్థానం, పప్పల వైకుంఠ రావుకు ద్వితీయ స్థానం, నవ్యశ్రీకు తృతీయ స్థానం, బోగిల ఉమామహేశ్వరరావుకు కన్సొలేషన్ బహుమతులు దక్కాయని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో కోవెలకొండ సంతోష్‌కుమార్ స్వామికి ప్రథమ, బాడ శ్రీనివాసరావుకు ద్వితీయ స్థానం, ఎస్ వాహినికి తృతీయ స్థానం గెలుపొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూజారి గోవిందరావు, కుమార్, సంజీవరావు, సురేష్ బాబు, మన్మధరావు, వాసుదేవరావు, సమత తదితరులు పాల్గొన్నారు.

నీరజకు ఉగాది విశిష్ట పురస్కారం



ఉగాది పురస్కారాలతో అభినయ నృత్యనికేతన్ చిన్నారులు, నీరజా సుబ్రహ్మణ్యం

శ్రీకాకుళం కల్చరల్: విశాఖ పబ్లిక్ లైబ్రరీలో ధ్యాన అన్నమయ్య ట్రస్ట్, స్కై ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉగాది కళా ఉత్సవంలో నగరానికి చెందిన అభినయ నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు డాక్టర్ నీరజా సుబ్రహ్మణ్యంకు ఉగాది విశిష్ట పురస్కారంతో ఆదివారం సత్కరించారు. ఈమె కూచిపూడి, భరతనాట్యంలలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గాను ఈ పురస్కారాన్ని అందించారు. నీరజ శిష్యబృందం ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ చిన్నారులను కూడా ఉగాది పురస్కారాలతో సత్కరించారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 91వ నెలవారీ సాహితీ సమ్మేళనం ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో కవులు సామాజిక పరమైన కవితలు చదివారు. కవి సమ్మేళనంలో కవులు ఐ ఎన్‌డీ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఇద్దె పాపయ్య, తోట గోపాలరావు, నిక్కు అప్పన్న, పూడి జనార్దనరావు, భోగిల ఉమామహేశ్వరరావు, బి.మోహన్‌గాంధీ, కె.బాలాజీ, రవికిరణ్, ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దొండొనచో దీక్షలు



పర్లాకిమిడి బట్టగౌడో వీధిలో ధూలి దొండో దీక్షలు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

పవిత్ర చైత్రమాసం పురస్కరించుకుని గజపతి, గంజాం జిల్లాల్లో దొండొనచో దీక్షలు కొనసాగుతున్నాయి. పర్లాకిమిడిలో మా శ్యామకాళీ మందిరం నుంచి ఆదివారం ఉదయం భారీ ఊరేగింపు జరిగింది. బట్టగౌడో వీధి, హిల్‌పట్నా రోడ్డులో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధూలి దొండోలో భాగంగా రోడ్డుపై ఇసుకవేసి బోర్లా పడుకుని అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈ నెల 14 వరకూ ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

– పర్లాకిమిడి/బరంపురం



పర్లాకిమిడిలో దీక్షాదారుల ఊరేగింపు



పర్లాకిమిడిలో దొండకాళీ అమ్మవారి ఊరేగింపు





మధ్యాహ్నం ఎండలో దీక్షాధారుల విన్యాసాలు



హిల్‌పట్నా రోడ్డులో పంచా దొండనచో పూజలు



కొరాపుట్‌లో.. రాయగడ నేతలతో రాజ్యం!

- ప్రారంభ ఎన్నికల నుంచి వీరిదే ఆధిపత్యం
- కొనసాగుతున్న సంప్రదాయం



భగీధర గొమాంగో



గిరిధర్ గొమాంగో



హేమా గొమాంగో



రామచంద్ర ఉల్కా



సప్తగిరి శంకర ఉల్కా

జయపురం: కొరాపుట్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రారంభం నుంచి ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే రాయగడ ప్రాంతం వారిదే ఆధిపత్యమని తేటతెల్లమవుతోంది. కొరాపుట్ పార్లమెంట్ నియోజకవర్గంలోని రాయగడ జిల్లాలో మూడు, కొరాపుట్ జిల్లాలో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్స్ ఉన్నాయి.

- 1952 ఎన్నికల్లో కొరాపుట్ జిల్లా రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించారు. ఒకటి నవరంగపూర్ కాగా, మరొకటి రాయగడ -ఫుల్‌బాణి. అప్పటి నుండి ఈ నియోజకవర్గంలో రాయగడ ప్రాంతం వారే ఎక్కువగా ఆధిపత్యం వహిస్తున్నారు.
- 1951-52 ఎన్నికల్లో రాయగడ ప్రాంతానికి చెందిన తోయిక సంగన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- 1957లో కొరాపుట్‌ను ఇద్దరు సభ్యుల స్థానంగా మార్చారు. వాటిలో ఒకటి జనరల్ కాగా మరొకటి ఎస్టీ. జనరల్ స్థానం నుంచి జయపురం వాసి రాచకొండ జగన్నాథరావు ఎన్నికవగా, ఎస్టీ స్థానం నుంచి టి.సంగన్న గెలుపొందారు.
- 1962 ఎన్నికల్లో కొరాపుట్ పార్లమెంట్ స్థానం ఏర్పడింది. రాయగడకు చెందిన రామచంద్ర ఉల్క(ప్రస్తుత ఎంపీ సప్తగిరి ఉల్కా తండ్రి) లోకసభకు ఎన్నికయ్యారు. ఆయనే 1967లోనూ ఎన్నికయ్యారు.
- 1971లో గుణుపురం వాసి భగీరథ్ గొమాంగో విజయం సాధించారు. రాష్ట్ర మంత్రి వర్గంలో చోటుదక్కడంతో ఎంపీ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో 1972లో ఉప ఎన్నిక జరగడంతో గిరిధర్ గొమాంగో విజయం సాధించారు. 1972 నుంచి 1998 వరకు జరిగిన 8 ఎన్నికల్లో ఆయన విజయం సాధించడం విశేషం. 1999 ఫిబ్రవరి 15 నుంచి 1999 డిసెంబర్ 6 వరకు ముఖ్యమంత్రిగా ఉండటంతో అప్పుడు జరిగిన ఎన్నికలో ఆయన సతీమణి హేమా గొమాంగో కొరాపుట్ ఎంపీగా విజయం గెలుపొందారు.
- 2004లో జరిగిన సాధారణ ఎన్నికలలో మరోసారి గిరిధర గొమాంగో పోటీ చేసి 9వ సారి పార్లమెంట్‌కు వెళ్లారు.
- అంతవరకు రాయగడ ప్రాంతం వారే ఎంపీలుగా ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన కొరాపుట్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొదటిసారి కొరాపుట్ జిల్లా నేత జయరాం పంగి 2009లో జరిగిన ఎన్నికలో విజయం సాధించి చరిత్ర సృష్టించారు. 2014లో కొరాపుట్ జిల్లా నేత జినా హికాక గెలుపొందారు.
- 2019 ఎన్నికల్లో రాయగడ వాసి సప్తగిరి శంకర ఉల్కా విజయం సాధించారు. మొత్తమ్మీద కొరాపుట్ పార్లమెంట్ స్థానంలో 1952 నుంచి 2019 వరకు జరిగిన 17 ఎన్నికల్లో 15సార్లు రాయగడ వాసులే ప్రాతినిధ్యం వహించడం విశేషం.

ఎండ ప్రచండం

- నగరంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత
- కర్ఫ్యూను తలపిస్తున్న రహదారులు

బరంపురం: భానుడు భగభగమంటున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అత్యవసరమైన పని ఉంటే తప్ప బయటకు రావడం లేదు. ఆదివారం బరంపురంలో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 7 నుంచి సూర్యప్రతాపం మొదలవుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు నరకయాతనకు గురవుతున్నారు. పశుపక్ష్యాదులు కూడా ఎండకు విలవిల్లాడుతున్నాయి. సాయంత్రం పూట ఆకాశం మేఘావృతమైనా చినుకు పడకపోవడంతో ప్రజలు నిరాశచెందారు.



భానుడి భగభగ



కర్ఫ్యూను తలపిస్తున్న జననీ ఆస్పత్రి ప్రధాన రహదారి



బాటసారులకు పానీయాలు పంపిణీ చేస్తున్న స్కౌట్



ఎండ తీవ్రతకు ముఖాలకు రక్షణ తప్పనిసరి

భారీగా గంజాయి స్వాధీనం



రాయగడ: పద్మపూర్‌లో పట్టుబడిన గంజాయి నిందితుడు



రాయగడ: బిసంకటక్ పోలీసులకు చిక్కిన నిందితులు



బరంపురం: వ్యాన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు



జయపురం: నిందితుడితో పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్, బిసంకటక్‌లలో పోలీసులకు భారీగా గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఆదివారం పద్మపూర్‌లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గజపతి జిల్లా నుంచి రాయగడ వైపు వస్తున్న బొలేరోను తనిఖీ చేశారు. అందులో 68 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ ఘటనలో బుజబల్ గ్రామానికి చెందిన టున్ని కద్రక (24)ను అదుపులోకి తీసుకున్నారు. శనివారం సాయంత్రం బిసంకటక్ పోలీసులు చంచరగుడ కూడలిలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో విచారణ చేపట్టారు. వీరి వద్ద 22.200 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాకేష్ బాబు, బిట్టు కుమార్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

- బరంపురం: పికప్ వ్యాన్‌లో తరలిస్తున్న 42 కిలోల గంజాయిని కొంధమాల్ జిల్లా ఫిరింగియా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి గోపీనాథ ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి కొంధమాల్ జిల్లా ఫిరింగియా పోలీసు స్టేషన్ పరిధిలో గుండిపడా సమీప అటవీ ప్రాంతంలో రవాణాకు సిద్ధంగా ఉన్న వ్యాన్‌ను పోలీసులు తనిఖీ చేశారు. అందులో 42 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనివిలువ రూ.5లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ పరారయ్యాడని చెప్పారు.
- జయపురం: సదర్ పోలీసులు మార్చి 20న కంటైనర్‌లో స్వాధీనం చేసుకున్న 397 కేజీల గంజాయికి సంబంధించి ప్రధాన నిందితుడు దిలీప్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అప్పట్లోనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. శనివారం జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకితకుమార్ వర్మ కేసు వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితుడు బీహార్ రాష్ట్రం బెగుసరై జిల్లా చొరాలయటక్ గ్రామానికి దిలీప్ రాయ్ అని, ఇతను అంతర్ రాష్ట్ర గంజాయి ముఠాకు చెందిన వ్యక్తి అని తెలిపారు. సమావేశంలలో సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి పాల్గొన్నారు.

ఆసక్తిగా క్రికెట్ పోటీలు



విజేతగా నిలిచిన సర్వేయర్ కాజా జట్టు

వజ్రపుకొత్తూరు రూరల్: ఏప్రిల్ 10న నేషనల్ సర్వే డే సందర్భంగా జిల్లా సర్వేయర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయిలో క్రికెట్ పోటీలు జరిగాయి. పోటీల్లో డివిజన్ సర్వేయర్ 'కాజా' జట్టు విజేతగా నిలిచింది. అనంతరం ఉద్యోగులు రక్తదానం చేశారు. కాగా విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడితో ఉండే సర్వేయర్లకు మానసిక ఉత్తేజాన్ని కల్పించేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే పోటీ పరీక్షలు

ఇచ్ఛాపురం: విద్యార్థుల్లో గల ప్రతిభను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతా యని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధి, మండలాధ్యక్షుడు అశోక్‌జాదవ్ అన్నారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధి ఒడియా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి మేధాసమ్మాన్ పోటీపరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని ప్రభుత్వ ఒడియా ప్రాథమిక పాఠశాలల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీ పరీక్షలకు పరిశీలకులుగా మిన్ను చంద్రమండల్, సిద్ధార్థ లిమ్మాయ్ వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన శుభమ్‌సాహు, మానసి మహాపాత్రో, ప్రణయసాహు లకు బాపూజీ ఒడియా పాఠశాల అధ్యక్షుడు రఘునాథ్ గౌడో, ఒడియా ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు డిల్లేశ్వర్ శెట్టి, ప్రశాంత్‌లిమ్మాయ్, భాస్కర్‌పాఢి, మురళీధర్‌గౌడో, శ్రీనివాసపూండి, చంద్రశేఖర్, కవిరాజ్‌రెడ్డి, కేశవరావు, భగీరథి, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

5600 లీటర్ల ఊటలు ధ్వంసం



ఎగువబగడ గ్రామంలో స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసు బలగాలు

మెళియాపుట్టి: మండలంలోని మర, బాలేరు, భరణికోట, ఎగువబగడ గ్రామాల్లో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సారా తయారీ స్థావరాలపై ఆదివారం సంయుక్త దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ దాడుల్లో 5600 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేయగా.. 120 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటుసారా తయారీని నిలువరించేందుకు కృషి చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను తెలియపరచి, సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని సూచనలు చేశారు.

ఈ దాడుల్లో ఈఎస్ తిరుపతినాయుడు, సీఐలు రామచంద్ర కుమార్, రాజశేఖర్ నాయుడులతో పాటుగా, ఎఆర్ పోలీస్ బృందం, శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, టెక్కలి, కొత్తూరు, పాతపట్నం ఎస్ఈబీ పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్, డీటీఎఫ్ సిబ్బంది, మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్, పాతపట్నం ఎస్సై మహ్మద్ యాసిన్ పలువురు సిబ్బంది ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: స్థానిక అక్కవరం గ్రామ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని ముంజేటి గురయ్య(69) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకా రం.. పోలాకి మండలం రెహమాన్ పురం పంచాయ తీ బెజ్జిపాడు గ్రామానికి చెందిన గురయ్య ఆదివా రం టెక్కలి మండలం శ్యామసుందరపురం గ్రామంలో ఉన్న తన కుమార్తె సుహాసినికి ఉగాది పిలుపు చేసి తిరిగి వెళ్తుండగా.. అక్కవరం వద్ద ఉన్న ప్రైవేట్ డిగ్రీకళాశాల సమీపంలో రోడ్డు దాటుతుండగా ప లాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే చనిపోయారు.



మృతి చెందిన గురయ్య

విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

బొబ్బిలి: మండల పరిధిలోని అలజంగి వద్ద గల వేగావతి నదిలో ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు నడుపుతున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ కల్యాణ్ చక్రవర్తి, వీఆర్వో సీహెచ్ సుధాకర్‌లకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: సర్కిల్ పరిధిలోని బాడంగి మండలం గొల్లాదికి చెందిన గొర్లె అప్పలనాయుడు మద్యం సీసాలు తరలిస్తుండగా దాడి చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ బీవీ మురళీధర్ తెలిపారు. ఎస్ఈబీ కార్యాలయానికి అందిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించగా 51 సీసాలను తరలిస్తున్న అప్పలనాయుడిని గుర్తించామన్నారు. నిందితుడి నుంచి మద్యం సీసాలు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు ఎస్వీ రామారావు, ఎల్ తిరుపతిరావు, హెచ్‌సీబి మాధవీదేవి, ఈసీలు బి.ఆదినారాయణ, వై.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రాస్పత్రి ఆవరణంలో గల చెట్టుకింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడు సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నట్లు చెప్పారు. మృతుని గురించి విచారణ చేయగా ఎటువంటి వివరాలు తెలియరాలేదని, ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


రిమ్స్‌లో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న డీఏ కుర్షిదా బీబీ

భామిని: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకలను వృద్ధులకు అందించడంలో సచివాలయ ఉద్యోగులు చొరవ చూపుతున్నారు. భామిని మండలంలోని బిల్లుమడకు చెందిన వృద్ధుడు పిలకా విశ్వనాథం అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్నాడు. దీంతో నులకజోడు సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ కుర్షిదా బీబీ రిమ్స్ ఆస్పత్రికి ఆదివారం వెళ్లి వృద్ధుడు విశ్వనాథం వేలిముద్ర తీసుకుని పింఛన్ అందించింది. ఆదివారం సెలవు రోజైనప్పటికీ వృద్ధుడికి పెన్షన్ అందివ్వాలనే తపనతో డిజిటల్ అసిస్టెంట్ పింఛన్ అందించడంపై పలువురు అభినందిస్తున్నారు.

ఎరుకులపేట వద్ద గజరాజులు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ ఎరుకలపేట, వెంకటరాజపురం పరిసర ప్రాంతాలలో గజరాజులు ఆదివారం సంచరిస్తూ భయాందోళనకు గురి చేశాయి. పామాయిల్, అరటి, వరి పొలాలలో తిరుగుతూ పంటలను ధ్వంసం చేశాయి. రాత్రి సమయాన వెంకటరాజపురం పరిసర ప్రాంతాలలోని పామాయిల్ తోటలో తిష్ట వేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాన పంట పొలాలకు వెళ్లే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీలున్నంత వరకు రాత్రి సమయాన పంట చేలకు వెళ్లవద్దని అటవీ సిబ్బంది హెచ్చరించారు.

సాయంత్రం వేళ ఏనుగుల షికారు

భామిని: పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఏనుగుల గుంపు విలవిల లాడుతోంది. ఈ నేపథ్యంలో భామిని మండలంలోని తాలాడ సమీపంలో తిష్ట వేసిన నాలుగు ఏనుగుల గుంపు ఆదివారం సాయంత్రం తరువాతే బయటకు వచ్చాయి. పెరిగిన ఎండల తీవ్రతను తట్టుకోలేక తోటల్లోనే ఉంటూ వాతావరణం చల్లబడితేనే బయటకు వచ్చి పంట పొలాల్లోకి చేరి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. చుట్టూ ఉన్న పంటలను ధ్వంసం చేసి వెంటనే సమీపంలోని వంశధార నదిలో జలకాలాటతో కాలక్షేపం చేసి సేదదీరుతున్నాయి.

సమస్యలపై దృష్టి సారిస్తున్నాం

- బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్‌లో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలపై దృష్టి సారిస్తున్నామని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ అన్నారు. స్థానిక రాజీవ్ నగర్ కాలనీ గాయత్రి భవన్‌లో అసోసియేషన్ 15వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వి.వరప్రసాద్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సర్కిల్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి కె.సోమసుందరం, ప్రసాదరావు, ఎస్ఎఫ్‌టీ ఇ.భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను పక్కన బెట్టి..

- వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు
- పార్టీ తీర్థం పుచ్చుకుంటున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు


విజయనగరం: టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దృశ్యాలు

విజయనగరం: రాష్ట్రంలో కూటమి కట్టిన తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు వారి కుటుంబాలు వైఎస్సార్‌సీపీ బాట పడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులమై తామంతా ప్రతిపక్షాలను విడిచిపెట్టి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం విజయనగరం, రాజాం నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీలో చేరిన వారి వివరాలిలా ఉన్నాయి.

విజయనగరంలో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలన, నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేసిన అభివృద్ధి విధానాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతుండడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమ్మన్న శెట్టి అన్నారు. ఈ మేరకు ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమ్మన్న శెట్టి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోలగట్ల తమ్మన్న శెట్టి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా నగరంలో కనీవిని ఎరుగని రీతిలో కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో అభివృద్ధి జరిగిందన్నారు. పెద్ద పల్లెటూరుగా నామకరణం ఉన్న విజయనగరాన్ని సుందరీకరణ దిశగా మార్చిన ఘనత కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆయన అండగా ఉంటారని చెప్పారు. గడిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి చూసి ఓటేయమని మరోసారి ప్రజలను అభ్యర్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాను, సీతాలు, ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పాడలో చేరిన 50 రజక కుటుంబాలు

విజయనగరం రూరల్: విజయనగరం మండలం దుప్పాడ గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావులు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఈశ్వర్‌కౌశిక్, అప్పలనాయుడులు మాట్లాడుతూ ప్రజలకు మంచి జరిగిందంటేనే ఓటేయండని అడిగే దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు కోరాడ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సతీష్, కె.రాములప్పడు, బద్రి భాస్కరనాయుడు, గుడారి పైడిరాజు, తండక పరశురాం తదితరులు పాల్గొన్నారు.


రాజాం: డాక్టర్ రాజేష్‌తో కలిసి జగన్నినాదం చేస్తున్న, వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాల వారు

రాజాంలో మరో 50 కుటుంబాలు

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామానికి చెందిన 50 రజక కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ మేరకు ఆదివారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రజకసెల్ జిల్లా అధ్యక్షుడు ఎ.వీరాస్వామి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వేమల అప్పారావు, యండమూరి సూర్యారావు, వజ్జిపర్తి ఎరకమ్మ, కొడదాల ఆనంద్, యండమూరి మంగయ్య, కొమరపురి చిన్నారావు, వేమాల కన్నయ్య, కొడదాల శ్రీను, బొండాడ ఉమ తదితరులతోపాటు మరో 40 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ పార్టీ కండువాలువేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా వారంతా ముక్తకంఠంతో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల వెంకటేష్, నక్క మోహనరావు, సర్పంచ్ నక్క శ్రీను, పీఏసీఎస్ డైరెక్టర్లు ముదిలి జనార్దనరావు, నక్క ఉమామహేశ్వరరావు, అలజంగి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం రూరల్: టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఈశ్వర్‌కౌశిక్, అప్పలనాయుడు, తదితరులు


రాజాం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌తో పార్టీలో చేరిన బొద్దాం గ్రామానికి చెందిన రజక కుటుంబాలు

రాజీపేటకు చెందిన 20 కుటుంబాలు

రాజాం: మండలంలోని రాజీపేట గ్రామానికి చెందిన పలు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ మేరకు ఆదివారం రాజాంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం వద్ద రాజీపేట గ్రామంలో టీడీపీకి చెందిన జి.పైడితల్లి దొర, త్రినాథ్, పెద్ద త్రినాథ్, నరసింహ, సీతమ్మ, రాములమ్మ, కోడూరు రూపవతి, త్రినాథ్, సూర్యనారాయణ, రాము, అప్పమ్మ, తవిటమ్మ, సాయి, ఎర్ర అప్పన్న, సంతోష్ దొర తదితరులతో పాటు మరో 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరగా, వారికి పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, కంచరాం సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ, ఎంపీటీసీ రాంబాబు, మాజీ ఎంపీటీసీ సామంతుల వెంకటప్పలనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, టౌన్ యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, సామంతుల తవిటినాయుడు, రొతు రామచంద్రినాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనసేనలోనూ గ్రూపుల గోల

- రంగులు మారుస్తున్న టీడీపీ నాయకులు
- మొన్న జయకృష్ణ..నేడు భూదేవి జనసేనలో చేరిక
- విస్తుపోతున్న జనసైనికులు


పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన టీడీపీ నాయకురాలు భూదేవి

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలోని టీడీపీలో ఉన్న వర్గ పోరు తారస్థాయికి చేరుతోంది. ఇప్పుడు ఈ గ్రూపుల గోల జనసేనకు తాకడంతో జనసైనికులు విస్తుపోతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా పాలకొండ టికెట్‌ను జనసేనకు కేటాయించిన విషయం తెలిసిందే. దీంతో ఈ నియోజకవర్గంలో టీడీపీలో గ్రూపులుగా ఉన్న నిమ్మక జయకృష్ణ, పడాల భూదేవి జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. సీటు కోసం ఆరాటపడుతూ మొన్న జయకృష్ణ జనసేనలో చేరగా పడాల భూదేవి పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనంలో ఆదివారం చేరడం చర్చనీయాంశమైంది. ఇలా ఎవరికి నచ్చినట్లు వారు టీడీపీ నుంచి వచ్చి జనసేనలో చేరిపోయి టికెట్ అడుగుతుంటే ఆదినుంచి పార్టీలో ఉన్న మా పరిస్థితి ఏంటని జనసైనికులు విస్తుపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 అసెంబ్లీ స్థానాల్లో పొత్తులో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ 174 సీట్లలో తమ అభ్యర్థులను ప్రకటించాయి. అయితే ఒక్క పాలకొండ సీటు మాత్రం పెండింగ్‌లో ఉండడం చర్చనీయాంశమైంది.

స్వార్థ ప్రయోజనాల కోసమే..

పాలకొండ నియోజకవర్గంలో బలమైన శక్తిగా ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవడం ప్రతిపక్షాలకు సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి అఖండ మెజార్టీతో గెలుస్తారని సర్వే రిపోర్టులు చెబుతున్నాయి. అలాంటప్పుడు టీడీపీ నాయకులు సీటు కోసం ఎందుకింత ఆరాటపడుతున్నారనే అనుమానాలు చాలా మందికి ఉన్నాయి. పార్టీ అధిష్టానం నుంచి ఎన్నికల ఖర్చు కోసం ఫండ్ వస్తుంది. ఇక్కడి టికెట్ జనసేనకు కేటాయించడంతో టీడీపీ నాయకులు సిగ్గు, ఎగ్గూ లేకుండా టీడీపీని వీడి జనసేనలోకి వెళ్తుండడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

సైకిల్‌ను మడత పెట్టేశారు..

నిన్నటి వరకు టీడీపీలో వర్గాలుగా ఉన్న పాలకొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ, అలాగే టికెట్ తనకే వస్తుందని ఆశించిన మరో అభ్యర్థి పడాల భూదేవి టీడీపీ తరఫున టికెట్ బరిలో ఉన్నారు. అయితే టికెట్ జనసేనకు కేటాయించడంతో సైకిల్‌ను మడత పెట్టేసి వీరు జనసేనలో చేరడంతో పాలకొండ నియోజకవర్గంలో టీడీపీ భూస్థాపితం అవడం ఖాయమని సీనియర్ టీడీపీ నేతలు అంటున్నారు. మళ్లీ పాలకొండలో గెలిచేది వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి అని సీనియర్ రాజకీయ నాయకులు, ప్రజానీకం స్పష్టం చేస్తున్నారు.

చర్చలకు 'మిమ్స్' పిలుపు

నెల్లిమర్ల రూరల్: సమస్యల పరిష్కారానికి సామరస్య పూర్వక వాతావరణం కావాలని, చర్చల ద్వారానే సమస్యల పరిష్కారానికి వీలుందని మిమ్స్ యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మిమ్స్ ఉద్యోగులు రోడ్డెక్కిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిమ్స్ యాజమాన్యం స్పందించింది. శాంతియుతంగా పెద్దల సమక్షంలో చర్చించుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొంది. బయట వ్యక్తుల ప్రలోభాల వలలో పడి హింసాత్మక పరిస్థితులకు దారితీసే వైపు వెళ్లద్దని హితవు పలికింది. సంస్థ కీర్తి ప్రతిష్టలను కాపాడాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని, ఇప్పటికే చర్చలు ఒక కొలిక్కి వచ్చి చివరి దశకు చేరుకున్నాయని, రేపో, మాపో ఇరువర్గాలు చర్చలు జరిపి ఫుల్ స్టాప్ పెడదామని పిలుపునిచ్చింది. సంస్థ ఉద్యోగులపై భౌతిక దాడులకు దిగడాన్ని యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తోందని, ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరింది. ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విధుల్లో చేరాలని సూచించింది.

ఆరుగురు జూదరుల అరెస్టు

విజయనగరం క్రైమ్: మండల పరిధిలో జమ్ము గ్రామం శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులపై రూరల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అందించిన సమాచారంతో రూరల్ ఎస్సై వాసుదేవ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.25,670లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించాలి

- వాగ్దేవి సమారాధనం సంస్థ అధ్యక్షురాలు స్వప్న హైందవి


నామ రామాయణం గోష్ఠి గానం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భక్తి భావన పెంపొందించేలా వాగ్దేవి సంస్థ పూర్తిస్థాయిలో కృషిచేస్తుందని వాగ్దేవి సమారాధనం, జై పైడిమాంబ వేద సంస్కృతాంధ్ర సంప్రదాయ పరిరక్షణ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి పేర్కొన్నారు. ఏప్రిల్ 9న ఉగాది రోజున వాగ్దేవి సమారాధనం సంస్థ నాలుగవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గురజాడ స్వగృహంలో ఆదివారం వివిధ పాఠశాలల చిన్నారులకు నామ రామాయణం గోష్ఠిగానం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 300 మంది చిన్నారులు బ్యాచ్‌కి 25మంది చొప్పున కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. విజేతలకు ఉగాదిరోజున గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం మేడపైన ఉన్న దాసో భవనంలో నిర్వహించే సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.అనూరాధ, ఎం.సుబ్రాదేవి, బీఏ.రవికుమార్, ఇందిర, శ్రీనివాసరావు, సంతోషలక్ష్మి, సావిత్రి, చిన్నాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చాలా మంది బిజీ అయిపోయి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం లేదన్నారు. ఫలితంగా తక్కువ వయసులోనే బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. నిత్యం వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని హితవు పలికారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి, డీఐఓ అచ్యుతకుమారి, డెమో వి.చిన్నతల్లి, బి. మహాలక్ష్మి పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


మామిడితోటల్లో గుర్తించిన బెల్లం ఊట డ్రమ్ములు

కొత్తవలస: మండలంలోని దేవాడ గ్రామం శివారులో గల మామిడి తోటల్లో రహస్యంగా నిర్వహిస్తున్న సారా తయారీ శిబిరాలపై ఎస్సై సుదర్శన్ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. సారా తయారీకి పులియబెట్టిన బెల్లం ఊటను భూమిలో గొయ్యి తీసి తయారీదారులు రహస్యంగా పాతిపెట్టిన సమాచారం తెలుసుకున్న ఎస్సై సుదర్శన్ తన సిబ్బందితో మామిడి తోటల్లో తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్లాస్టిక్ డ్రమ్ములతో ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు.


గుర్ల: బెల్లపు ఊటలను ధ్వంసం చేస్తున్న ఎస్సై భాస్కరరావు, సిబ్బంది

మరో 3వేల లీటర్లు..

గుర్ల: మండలంలోని దేవునికణపాక శివారు ప్రాంతంలో మూడు చోట్ల సారా తయారీ ప్రాంతాలను ఎస్సై భాస్కరరావు ఆదివారం గుర్తించారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధంగా ఉన్న సుమారు 3వేల లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. దీంతో పాటు 25 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎస్సై భాస్కరరావు తెలిపారు. సారా తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్లపు ఊటలను ధ్వంసం చేసిన వారిలో గుర్ల పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

రెండు గ్రామాల్లో అగ్ని ప్రమాదం

- జాకేరులో గడ్డివాము, వేపాడలో జీడి, నరుగుడు, నీలగిరి తోటలు దగ్ధం


వేపాడలో కాలిపోతున్న మొక్కలు

వేపాడ: మండలంలోని వేపాడ, జాకేరు గ్రామాల్లో ఆదివారం అగ్ని ప్రమాదాలు జరిగాయి. మండలకేంద్రం వేపాడ రెవెన్యూ పరిధిలో నూలుమెట్టపై ఉన్న మెట్టుగర్వుల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 15 ఎకరాల్లో గల మామిడి, టేకు, నీలగిరి, నరుగుడు తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.ఆరులక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేసినట్లు ఎస్.కోట అగ్నిమాపకశాఖాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఆదపురెడ్డి అప్పారావు, ఎస్.సత్యనారాయణ, ఎస్.మురళి, వేండ్రపు అప్పారావు, మల్లునాయుడు తదితర రైతులు తోటలు కాలిపోయినట్లు చెప్పారు. అలాగే జాకేరు గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో గుమ్మాల జగ్గారావు గడ్డివాము, అగ్నికి ఆహుతైంది. ఈ రెండు ప్రమాదాల్లో ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేయడంతో నష్టం కొంతవరకు తగ్గింది. జాకేరులో జరిగిన నష్టం సుమారు రూ.18 వేలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఒడియా విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

భామిని: మండలంలోని బత్తిలి హైస్కూల్‌లో ఆదివారం ఒడియా విద్యార్థులకు ఒడియా మేధా సమ్మాన్ టెస్ట్ నిర్వహించారు.ఏపీ ఒడియా టీచర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్ట్ 5వ తరగతి ఒడియా విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ ఓటీఓ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సుశీల, ఎస్.రాజశేఖర్ టాలెంట్ టెస్ట్ పేపర్లు దిద్ది మొదటి మూడు స్థానాలు పొందిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. సంఘం సభ్యులు బి.క్రాంతి, కె.రాము, సులోచన, ఇందిర సహకరించారు.

అదృశ్యమైన చిన్నారుల ఆచూకీ లభ్యం


అదృశ్యమైన చిన్నారులతో బంధువులు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం గ్రామంలో శనివారం రాత్రి అదృశ్యమైన ఇద్దరు చిన్నారుల ఆచూకీ లభ్యమైంది. గ్రామానికి చెందిన జాఫర్‌ఖాన్ కుమారులు షేక్ ఫరీద్‌ఖాన్, షేక్ ఉమీర్‌ఖాన్‌లు అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు, బంధువులు ఊరంతా గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో బుదరాయవలస పోలీసులను ఆశ్రయించగా రంగంలోకి దిగిన ఎస్సై వి.లోకేశ్వరరావు దర్యాప్తు చేపట్టగా ఆదివారం సాయంత్రానికి చిన్నారుల ఆచూకీ తెలిసింది. దీంతో చిన్నారులను కుటుంబసభ్యులకు ఎస్సై అప్పగించారు.

నిధుల దోపిడీకి వారధి సారథి గెడ్డ

- 4 కిలోమీటర్లకు... రూ.4కోట్లు-నీరు
- చెట్టు నిధులు కాజేసిన టీడీపీ నేత
- పనుల రికార్డుల గల్లంతు


టీడీపీ కార్యకర్తకు కోట్లు తెచ్చిపెట్టిన సారథిగెడ్డ

రాజాం: అయనో గ్రామస్థాయి టీడీపీ కార్యకర్త. టీడీపీ అధికారంలో ఉండగా అక్రమ సంపాదనపై దృష్టి సారించాడు. కార్యకర్తలను పెంచి పోషించేందుకు అప్పట్లో చంద్రబాబునాయుడు నీరు చెట్టు పేరుతో విచ్చలవిడిగా నిధుల కేటాయించిన క్రమంలో సొమ్ము చేసుకున్న ఆ కార్యకర్త ఇప్పుడు అటు రాజాం పట్టణాన్ని, ఇటు మండలాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు ఉరకలు వేస్తున్నాడు.

ఏకంగా రూ.4 కోట్లు స్వాహా

రాజాం మండలంలోని మారేడుబాక గ్రామం నుంచి అంతకాపల్లి మీదుగా సంతకవిటి మండలం వరకు సారథిగెడ్డ విస్తరించి ఉంది. ఎక్కువ పూడికలు, కలుపు మొక్కలతో ఉన్న ఈ గెడ్డలో 2015-17 మధ్య కాలంలో నీరు-చెట్టు పనులు చేశారు. మారేడుబాక గ్రామం నుంచి అంతకాపల్లి వరకూ నాలుగుకిలోమీటర్లు కూడా ఉండని ఈ కాలువలో రూ. 4 కోట్లతో పనులు చేసినట్లు రికార్డులు సృష్టించారు. వాస్తవానికి ఈ పనులను వారం రోజుల వ్యవధిలో పొక్లెయిన్‌తో చేసి మమ అనిపించారు. ఇంత చిన్న పనికి అక్షరాల రూ.4 కోట్లు టీడీపీ కార్యకర్త అప్పనంగా స్వాహా చేశాడని పలువురు ఆరోపిస్తున్నారు.

అస్తులు అమ్ముకునే స్థాయి నుంచి..

మారేడుబాక గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నీరు-చెట్టు పనులు రాకముందు ఊరిలో ఉన్న సొంత ఆస్తిని కూడా అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే ఆ సమయంలో నీరు-చెట్టు పనులు రావడంతో పాటు సారథి గెడ్డ అప్పనంగా కనిపించింది. ఈ కాలువలో పనులకు ప్రతిపాదనలు పెట్టడంతో పాటు వెంటనే నిధులు కూడా వచ్చేశాయి. ఫలితంగా ఆస్తులు అమ్ముకోవాల్సిన ఆ కార్యకర్త జి.సిగడాంతో పాటు ఇతర ప్రాంతాల్లో పెద్దపెద్ద పరిశ్రమలు పెట్టేస్థాయికి ఎదిగాడు. ఇప్పుడు టీడీపీ తరఫున రాజాం పట్టణం, మండలంలో ప్రధాన నేతగా వ్యవహరించడమే కాకుండా పార్టీకి డబ్బులు ఖర్చుపెట్టే స్థాయికి చేరాడు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇలా నీరు-చెట్టు పనులు ఒక్క సారథి గెడ్డలోనే కాకుండా తన స్వగ్రామంలోని సాగునీటి చెరువుల్లో చేసి నిధులు దోచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలు బయటకు తీసేందుకు అదే గ్రామానికి చెందిన కొంత మంది యువత ప్రయత్నించగా రికార్డులన్నీ మాయమయ్యాయి. ఈ వ్యవహారం తన పీకలమీదకు వస్తుందని తెలిసి కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న ఆ నేత ఇప్పుడు మళ్లీ టీడీపీ ప్రచారంలో స్పీడ్ పెంచాడు. ప్రజలను మభ్యపెడుతూ అధికారం కోసం తాపత్రయ పడుతున్నాడు. గతంలో అధికారంలో ఉన్న ఈ కార్యకర్త అక్రమ సంపాదన కోట్లకు పరుగులెట్టగా..ఈ దఫా ఇంకెంత అక్రమ వ్యవహారం నడుపుతాడోనని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. సారథి గెడ్డలో జరిగిన నీరు-చెట్టు అక్రమాలపై చర్యలకు ఆ కాలువ ఆయకట్టు రైతులు ఇప్పుడు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తుండడం కొసమెరుపు.